# కాంగ్రెస్‌ను నమ్మితే కరెంటు కష్టాలు

## పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, నవంబర్ 5: కాంగ్రెస్ పార్టీని నమ్మితే మరోసారి కరెంటు కష్టాలు వస్తాయని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. కరెంటును సరఫరా చేయడానికి చేతగాని కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలకు అన్ని కష్టాలే అని విమర్శించారు. ఆదివారం పరిగి మున్సిపాలిటీలోని 5వ వార్డులో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయానికి, గృహావసరాలకు కరెంటు సరఫరా చేయలేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఇటీవల కర్ణాటకలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ వ్యవసాయానికి కేవలం 5 గంటలు కరెంటు ఇస్తున్నదని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రే ప్రకటించారంటే, కాంగ్రెస్ పాలన ఎలా ఉందో తెలుస్తున్నదన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్న తెలంగాణ ప్రజలు ఆ పార్టీ ప్రకటించిన గ్యారంటీలను నమ్మడం లేదన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి రావాలని చూస్తున్న కాంగ్రెస్ కలలు సాకారం కాబోవన్నారు. సీఎం కేసీఆర్ అంటేనే తెలంగాణ ప్రజలకు ప్రగాఢ నమ్మకమని, ఏ హామీ ఇచ్చినా నెరవేరుస్తారనే భరోసా ప్రజలకు ఉందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచడం ద్వారా తెలంగాణ మరింత అభివృద్ధి చెందడంతోపాటు మరిన్ని సంక్షేమ పథకాలు తమకు అందుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. ప్రచారంలో ఏ ఇంటికి వెళ్లినా అపూర్వ స్పందన వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి గతంలో కంటే అధిక మెజారిటీతో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ సురేందర్, మాజీ ఎంపీపీ కల్లు శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మీర్ మహమూద్‌అలీ, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షులు ఆర్.ఆంజనేయులు, మంగు సంతోష్ , సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.అశోక్‌వర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు నరోత్తంరెడ్డి, శ్రీనివాస్, అబ్దుల్ బషీర్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా

## కాంగ్రెస్ మాటలను నమ్మొద్దు : ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



రేగడిమైలారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట, నవంబర్ 5 : వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని రేగడిమైలారం, లింగన్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, కొత్తూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి సభల్లో మాట్లాడారు. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశానని అన్నారు. సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత గ్రామాలు ఎంతో అభివృద్ధిచెందాయని కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేసి పథకాలు అమలు చేస్తున్నదని అన్నారు. తెలంగాణ రాకముందు మంచినీటికి ఎన్నో ఇబ్బందులు పడ్డ ప్రజలు సీఎం కేసీఆర్ కృషితో ఇంటింటికీ నల్లా నీళ్లు వస్తున్నాయని అన్నారు. తనను ఓడించడం కోసం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి ఒక్కటయితే తన గెలుపు కోసం ప్రజలంతా ఏకమవుతున్నారని, ఎన్నికల్లో వారికి గుణపాఠం తప్పదని నరేందర్‌రెడ్డి అన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నదని విమర్శించారు. పేదలు, రైతుల కోసం మరింత సహాయం చేయడం కోసం బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను తయారు చేసిందని, ఎన్నికల్లో గెలిచిన తరువాత వీటిని అమలు చేస్తామని అన్నారు. కాంగ్రెస్‌కు 15 సీట్లు గెలిచే స్థితిలో కూడా లేదని, గెలిచిన వారు కూడా ఆ పార్టీలో ఉంటారన్న గ్యారంటీ లేదని నరేందర్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోమారు గెలిపిస్తే ప్రజలకు అండగా ఉండి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోట్ల యాదగిరి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రావణ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజేశ్వరి, లక్ష్మణ్, హన్మంతు, ఎంపీటీసీ జగదీశ్, పార్టీ నాయకులు దేశ్యానాయక్, శ్యామలయ్యగౌడ్, గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రేగడిమైలారంలో ర్యాలీగా వెళ్తున్న ప్రజలు



పరిగి, నవంబర్ 5: తెలంగాణ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, ఇటీవల సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాసాని వీరేశ్‌లను ఆదివారం పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లోని నివాసంలో కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిసిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పలు అంశాలపై ఆయనతో చర్చించారు.

# కనులపండువగా కల్యాణోత్సవం



పరిగి, నవంబర్ 5 : పరిగి పట్టణంలోని లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణాన్ని సిద్ధాంతి పార్థసారథి నేతృత్వంలో కనులపండువగా నిర్వహిం చారు. అంతకుముందు స్వామి వారికి అభిషేకం, హోమాలు, మహా పూర్ణా హుతి జరిపారు. స్వామి వారి కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎదిరె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పరిగి టౌన్, నవంబర్ 5 : మండల పరిధిలోని రాఘవపూర్ చెక్ పోస్టును ఎన్నికల వ్యయ పరిశీలకుడు మునీష్‌రజని పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. వాహనాల్లో పట్టుబడిన నగదుకు సంబంధించి నమోదు చేసిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకట్రామయ్య, ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

# ముమ్మరంగా ప్రచారం..




ధారూరు, నవంబర్ 5 : మండల కేంద్రంలో వికారాబాద్ బీఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్‌కు మద్దతుగా ఆదివారం ఆయన సతీమణి సబిత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమం లో ధారూరు జడ్పీటీసీ కోస్నం సుజాతా వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపార్వతీ రాజూ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ సునీతా రాం చందర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కావలి అంజయ్య, ఎంఐఎం మం డల అధ్యక్షుడు మోహిజ్ ఖురేషి, ధారూరు గ్రామ సర్పంచ్ చంద్రమౌళి, మండల యువజన విభాగం అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు గోవింద్ రాజ్ గౌడ్, చిన్నయ్యగౌడ్, అనంతయ్య, సుధాకర్‌గౌడ్, అంజయ్య, మహేశ్, అనిల్ కుమార్, రాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు



కులకచర్ల, నవంబర్ 5: చౌడాపూర్ మండల పరిధిలోని వీరాపూర్ గ్రామంలో పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి భార్య ప్రతిమారెడ్డి ఆది వారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించి మహేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్, నవంబర్ 5: మండలంలోని గుముడా గ్రామంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గెలుపు కోసం తనయుడు హితీష్‌రెడ్డి ఆదివారం ప్రచారం చేశారు. మండల బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో గడపగడపకు వెళ్లి ఇప్పటి వరకు కొడంగల్ వ్యాప్తంగా చేసిన ప్రగతిని వివరిస్తూ కారుగుర్తుగే ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గుముడాల సర్పంచ్ నర్సప్పతో పాటు బీఆర్‌ఎస్ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, ఎంపీపీ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బీములు బీఆర్‌ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట, నవంబర్ 5 : మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి మద్దతుగా ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఏర్పుమళ్ల గ్రామంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోట్ల యాదగిరి, రైతుబంధు మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి గ్రామాలను ఎంతో అభివృద్ధి చేశారని, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. రేగడిమైలారంలో ఎంపీటీసీ జగదీశ్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు.